



గార్గేయపుర బాలుర వసతి గృహం

శిథిల భవనాలు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 19: పేద విద్యార్థుల కోసం నిర్మించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ వసతి గృహాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. చాలా కాలంగా అధికారులు నిర్లక్ష్యం వహించి మరమ్మతు చేయక పోవడంతో శిథిలమైపోయాయి. ఊళ్లలో చదువు లేక, హాస్టళ్లలో సౌకర్యాలు లేక పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. కర్నూలు జిల్లాలో 29 ఎస్సీ, 8 ఎస్టీ, 29 బీసీ ప్రభుత్వ వసతి గృహాలు ఉన్నాయి. ఈ వసతి గృహాల్లో దాదాపు 19 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కర్నూలు బి. క్యాంపు బి సి, డి ఎన్ టి వసతి గృహాలు అర్ అండ్ బి క్వార్టర్స్‌లో కొనసాగుతున్నాయి. ఇందులో 70 మంది హాస్టల్‌లో ఉంటూ బీ క్యాంపు పాఠశాలలో చదువుతున్నారు.



- మూతబడిన హాస్టళ్లు
- విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

● అధికారుల నిర్లక్ష్యం...మూతబడిన హాస్టళ్లు..

గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల అభివృద్ధిని గాలికొదిలేసింది. పాత భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించకపోవడం, శిథిలమైన వాటికి మరమ్మతు పనులకు నిధులు కేటాయించకపోవడంతో హాస్టల్ భవనాలు అధ్వానంగా మారిపోయాయి. అవి ఎప్పుడు కూలిపోతాయో అనే భయంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. పాఠశాలలు తెరిచి వారం రోజులవుతున్నా మూతపడిన వసతి గృహాల్లోని పిల్లలను వారు కోరుకున్న వసతి గృహాల్లో చేర్పించడంలో వార్డెన్లు, అధికారులు ఘోరంగా విఫలమయ్యారనే విమర్శలున్నాయి. కాగా భవనాలు శిథిలావస్థకు చేరడంతో హాస్టళ్లను అధికారులు మూసేశారు. గార్గేయపురంలోని ఎస్సీ వసతి గృహంలో 65 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ భవనం విద్యార్థులు ఉండేందుకు అనువుగా లేదు. భవనం శిథిలావస్థకు చేరింది. వీళ్లను బి.క్యాంపు బాలికల కళాశాలల వసతి గృహం ప్రాంగణంలోని ఎస్‌టి హాస్టల్ భవనంలోనికి మార్చాలని సాంఘిక సంక్షేమ అధికారులు నిర్ణయించారు. ఆ భవనం మరమ్మతు పనులు చేసేందుకు పూనుకున్నారు. ప్రాంగణంలో ఉన్న చెట్లను కొట్టించారు. చెట్లను నరికిన విషయాన్ని అటవీ అధికారులకు విద్యార్థి సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో గార్గేయపురంలోనే హాస్టల్‌ను కొనసాగించేందుకు సాంఘిక సంక్షేమ అధికారులు పూనుకున్నారు. అయితే, ఈ హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు వార్డన్ సమాచారం ఇవ్వకపోవడంతో వారు ఆందోళనలో ఉన్నారు. మరికొంత మంది విద్యార్థులు పాఠశాలలో టిసి తీసుకొని వెళ్లేందుకు వారు చదివే పాఠశాలల చుట్టూ తల్లిదండ్రులతో తిరుగుతున్నారు. ఈ నెల 13 వ తేదిన పాఠశాలలు పున:ప్రారంభమైనా హాస్టళ్ల బుధవారం ఉదయం వరకు తెరవ లేదు. హాస్టల్‌లోని గదుల తలుపులకు వేసిన తాళాలు వేసినట్లే ఉన్నాయి. అయితే వార్డన్ విద్యార్థులకు భోజన వసతులు కల్పిస్తున్నట్లు విద్యార్థుల వివరాలు, ఫొటోలను మాత్రం సాంఘిక సంక్షేమ శాఖ లాగిన్‌కు నేరుగా పంపించారు. దీని మీద ఆంధ్రజ్యోతి విలేఖరి హాస్టల్ వద్ద నుంచే జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మి దేవికి ఫోన్ చేసి వివరణ కోరగా.., హాస్టల్ తెరిచారని, దానికి సంబంధించిన విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో పంపించినట్లు తెలిపారు. కానీ వాస్తవానికి హాస్టల్ తలుపులు తెరవకపోవడంతో ఆ తర్వాత గార్గేయపురం గ్రామ సర్పంచ్ విలేకరికి ఫోన్ చేసి.. హాస్టల్ వార్డన్‌ను ఈ ఒక్కసారికి వదిలేయాలని ఆంధ్రజ్యోతి ప్రతినిధిని రిక్వెస్ట్ చేశాడు.



● పాఠశాలలోనే మూడు గదులు కేటాయించాలని జిల్లా పరిషత్ సీఈని కోరాం

హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. కలెక్టర్ అనుమతి తీసుకుని బి.క్యాంపు బాలికల కళాశాల ప్రాంగణంలోని గిరిజన హాస్టల్ భవనంలోకి మార్చాలని నిర్ణయం తీసుకున్నాం. అటవీ శాఖ అధికారుల నుంచి అనుమతి రాకపోవడంతో గార్గేయపురంలోని హాస్టల్‌ను కొనసాగిస్తున్నాం. అయితే ఆ పక్కనే ఉన్న హైస్కూలులో మూడు గదులను హాస్టల్‌కు కేటాయించాలని గ్రామ సర్పంచు, అధికారులతో కలిసి డీఈవో శ్యాముల్‌కు వినతి పత్రం అందజేశాం. సీఈఓ సానుకూలంగా స్పందించారు. అనుమతులు వచ్చిన వెంటనే పాఠశాల గదుల్లోకి హాస్టల్‌ను మారుస్తాం.

--ఏఎస్‌డబ్ల్యూవో మద్దిలేటి కర్నూలు


మూతపడ్డ హాస్టల్


పెచ్చులూడిన పైకప్పు


అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు


తలుపులేని మరుగుదొడ్లు

పుష్కరాలలో అవినీతిపై లోకాయుక్తకు ఫిర్యాదు

- ఇద్దరు వైసీపీ నాయకులపై అనుమానం
- ఫిర్యాదుపై స్పందించిన లోకాయుక్త


రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన కర్నూలు న్యాయవాదులు

కర్నూలు(లీగల్), జూన్ 19: 2020 తుంగభద్ర పుష్కరాల ఏర్పాటులో జరిగిన అవినీతి అవకతవకలపై ఇద్దరు వైసీపీ నాయకులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై ఉచ్చు బిగుస్తోంది. పుష్కరాల ఏర్పాటులో భాగంగా మున్సిపల్ శాఖ అధికారులు అప్పట్లో నగరంలోని మురుగునీరు తుంగభద్ర నదిలో కలవకుండా తాత్కాలిక పైపులైను ఏర్పాటు చేశారు. దీని కోసం సుమారు రూ.6 కోట్ల విలువగల ప్లాస్టిక్ పైపులను కొన్నారు. పుష్కరాలు పూర్తయ్యాక వాటిలో సుమారు రూ.4 కోట్ల విలువ చేసే పైపులు స్థానిక వీకర్ సెక్షన్ కాలనీలో అనుమానాస్పద పరిస్థితిలో కాలిపోయాయి. దీనిపై ఆంధ్రజ్యోతి పత్రికలో పలు కథనాలు అచ్చయ్యాయి. ఆ తర్వాత మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ సమావేశంలో వాడి వేడి చర్చ జరిగింది. పైపులతో పాటు ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్ తదితరాల కొనుగోలులో కూడా అవినీతి జరిగిందని ప్రతిపక్షాలు గతంలో ఆరోపించాయి. ఈ కుంభకోణంపై స్పందించిన అప్పటి మున్సిపల్ అధికారులు ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే కొంత మంది వైసీపీ నాయకులు ఒత్తిడి చేసి ఆ కమిటీ పని చేయకుండా అడ్డుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మున్సిపల్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ఈ కుంభకోణంపై వెంటనే విచారించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కర్నూలు యువ న్యాయవాదులు కే. గణేష్, బి. మోహన్ కృష్ణ బుధవారం రాష్ట్ర లోకాయుక్తను ఆశ్రయించారు. ఈ కుంభకోణానికి బాధ్యులైన అప్పటి ఇద్దరు వైసీపీ నాయకులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు లోకాయుక్తను కోరారు. దీనిపై స్పందించిన రాష్ట్ర లోకాయుక్త చారణకు ఆదేశించారు. రాష్ట్ర లోకాయుక్త చొరవతోనైనా బాధ్యులపై చర్యలు తీసుకుంటే రాష్ట్ర ఖజానాకు గండిపడిన కోట్లాది రూపాయలు రికవరీ అవుతాయని ఆశిస్తున్నట్లు న్యాయవాదులు తెలిపారు.

వర్షాలు లేక నష్టపోయాం


ఆలూరులో రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

- ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం
- కేంద్ర కరువు బృందంతో రైతుల ఏకరువు
- ఆలూరు, కోడుమూరులో పర్యటన
- రైతులతో మాట్లాడిన కరువు బృందం సభ్యులు
- కరువు నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తాం
- ఐఏఎస్ అధికారి చిన్మయ పుండ్లిక్ రావు గాట్మేర్

ఆలూరు, జూన్ 19: రబీలో వర్షాలు రాక, సాగు చేసిన పంటలు దిగుబడి లేక తీవ్రంగా నష్టపోయామని ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటూ కేంద్ర కరువు బృందానికి రైతులు ఏకరువు పెట్టారు. బుధవారం కేంద్ర కరువు బృందం ఆలూరులో పర్యటించారు. గత సంవత్సరం రబీ సీజన్‌లోని కరువు పరిస్థితులను పరిశీలించేందుకు ముందుగా ఆలూరు పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో చేసిన రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ సభ్యులు డిపార్ట్మెంట్ ఆఫ్ ఎక్స్పెండీచర్ డైరెక్టర్ చిన్మయ పుండ్లిక్ రావు గాట్మేర్ (ఐఏఎస్) తాగునీరు, పారిశుద్యశాఖ డిప్యూటీ అడ్వైజర్ (పీహెచ్‌ఈ) ఆసిష్ పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ అరవింద్ కుమార్, సోని హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జిల్లాలో అత్యంత వెనుకబడిన ఆలూరు ప్రాంతంలో నిత్యం కరువు కాటకాలతో ఇబ్బందులకు గురి అవుతున్నామన్నారు. ఈ ప్రాంతంలో రబీ, ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలు దిగుబడి రాలేదని, దీంతో అప్పుల ఊబిలో కూరుకుపోయామని వివరించారు. మరోవైపు నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. సాగునీటి సమస్య పరిష్కారం అవ్వాలంటే పెండింగ్‌లో ఉన్న వేదవతి, నగరడోణ ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. రబీలో నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10వేలు ఇవ్వాలని కోరారు. కరువు మండలాల జాబితాలో కర్నూలు, తుగ్గలి మండలాలను చేర్చలేదని తెలిపారు.

● ఆంగ్లంలో రైతు సమస్యలు విన్నవించిన బెంగళూరు కిషోర్...

ఆలూరు ప్రాంతంలో కరువు, వర్షాభావ పరిస్థితులు, పెండింగ్ ప్రాజెక్టులు, సాగు, తాగునీటి సమస్యలపై టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బెంగళూరు కిషోర్ కేంద్ర బృందానికి ఇంగ్లీష్‌లో వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రంగమ్మ, ఆలూరు సర్పంచ్ అరుణాదేవి, సీపీఎం నాయకులు హనుమంతు, నారాయణస్వామి, వ్యవసాయశాఖ జేడీ వరలక్ష్మి, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, ఆలూరు ఏడీ సునీత, ఏవో వెంకటేశ్ గౌడ్, హార్టికల్చర్ పీడీ ఉమాదేవి, ఏవోలు అక్బర్ బాషా, దేవభూషణం, నరేంద్ర కుమార్, ఆనంద్, ఆలీ పీరా, జయలక్ష్మి, శివశంకర్ పాల్గొన్నారు.

● రైతులతో ముఖాముఖి

కోడుమూరు, జూన్ 19: కోడుమూరు ఎంపీడీవో సమావేశ భవనంలో కేంద్ర కరువు బృంద సభ్యులు రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. రూ.60 వేలు ఖర్చు చేసి మూడు ఎకరాల్లో శనగ పంట వేస్తే మూడు ఎకరాలకు కలిపి క్వింటన్నరకు మించి దిగుబడి రాలేదని, ఖరీలో వర్షాలు లేక దీనికి తోడు రబీలో ఎల్లెల్సీ జీడీపీ కాల్వలకు సకాలంలో నీరు రాక పంటలు ఎండిపోయాయని కోడుమూరు మండలం కల్లపరి గ్రామానికి చెందిన మనోహర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లెల్సీ జీడీపీ కాల్వకు నీరు అందించకపోవడం వల్ల తమ పంటలు ఎండిపోతున్నాయని ప్యాలకుర్తి గ్రామానికి చెందిన సీతారాముడు అన్నారు. ఎకరాకు రూ.18వేలు ఖర్చు చేసి శనగపంట వేస్తే ఆరు క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చిందని వర్కూరు గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పీమ్మార్ గడ్డి పిలకలు సబ్సిడీ కింద రైతులకు అందించాలని సుజేంద్రనాథ్‌రెడ్డి కోరారు. అనంతరం రైతు సంఘం నాయకులు వీరన్న, మనోహర్‌లు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, సబ్సిడీ కింద పనిముట్లు అందించి స్వామినాథన్ కమిటీ చేసిన సిఫారస్సును అమలు చేయాలని కరువు బృంద సభ్యులకు వినతి పత్రం అందజేశారు.

ఫొటో ఎగ్జిబిషన్ తిలకించిన కేంద్ర కరువు బృందం :

కోడుమూరు ఎంపీడీవో కార్యాలయంలో 2023-24 సంవత్సరంలో దెబ్బతిన్న శనగ, జొన్న, పొగాకు, మొక్కజొన్న పంటలకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్ కేంద్ర కరువు బృంద సభ్యులు తిలకించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ హిమప్రభాకర్‌రాజు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.


ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కరువు బృందం


వినతిపత్రం అందిస్తున్న కౌలు రైతు సంఘాల నాయకులు

ఎట్టకేలకు..!


జీడీపీ క్రస్ట్ గేట్లకు మరమ్మతులు


జీడీపీ నాలుగో క్రస్ట్‌గేట్‌కు మరమ్మతు చేస్తున్న దృశ్యం

గోనెగండ్ల, జూన్ 19: ఎట్టకేలకు గాజులదిన్నె ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల పనులు మొదలయ్యాయి. బుధవారం జీడీపీ నాలుగో క్రస్ట్‌గేట్ మరమ్మతు పనులు చేసేందుకు అధికారులు బుధవారం పూనుకున్నారు. దీంతో నాలుగో గేటును రోప్‌తోపైకి లేపి మరమ్మతు పనులు చేపడుతున్నారు. మిగతా ఐదు గేట్ల పనులను కూడా మరో 20 రోజుల్లో పూర్తి చేస్తామని జీడీపీ ఇరిగేషన్ అధికారులు తెలుపుతున్నారు. దీంతో దిగువ ప్రాంత గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే ఆగ్రహంతో..

ప్రాజెక్టుకు ఉన్న ఆరు గేట్లు మరమ్మతుకు నోచుకోలేదు. వరద సమయంలో గేట్లను ఎత్తడం కష్టమని తెలియడంతో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి గత ఆదివారం ప్రాజెక్టును సందర్శించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలం వరదలు వస్తే గేట్లు ఎత్తి నీటి విడుదల చేసేందుకు వీలు లేకపోతే ఎట్లా ప్రశ్నించారు. రెండు రోజుల్లో కనీసం రెండు గేట్లు అయిన మరమ్మతు చేయాలని అధికారులకు బీవీ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జీడీపీ అధికార యంత్రాంగం మరమ్మతు చర్యలకు పూనుకుంది. ప్రస్తుతం నాలుగో గేటు పనులు చేస్తున్నామని అధికారులు తెలుపుతున్నారు. ప్రాజెక్టుకు వరద నీరు వచ్చినా నాలుగో గేటు నుంచి నీటిని విడదల చేయవచ్చునని వారు పేర్కొంటున్నారు. మిగిలిన మరో ఐదు గేట్ల పనులను మరో 20 రోజుల్లో పూర్తి చేస్తామని చెబుతున్నారు.


మరమ్మతుకు నోచుకోని ప్రాజెక్టు ఐదు క్రస్ట్‌గేట్లు

మేయర్ పీఠం కోసం టీడీపీ?

● పెరుగుతున్న టీడీపీ కార్పొరేటర్ల సంఖ్య ● మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి సిద్ధం?



కర్నూలు(న్యూసిటీ), జూన్ 19: నగర పాలక సంస్థ మేయర్ పీఠాన్ని దక్కించుకునేందుకు టీడీపీ నాయకులు సిద్ధమవుతున్నారు. నగర పాలక సంస్థ పరిధిలో 52 వార్డులు ఉన్నాయి. ఇందులో కర్నూలు అసెంబ్లీ-33, పాణ్యం-16, కోడుమూరు-3 ఉన్నాయి. 2021 జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో పాణ్యం అసెంబ్లీలో 16 వైసీపీ అభ్యర్థులు గెలుపొందగా, కోడుమూరులో ముగ్గురు గెలిచారు. అయితే కర్నూలు అసెంబ్లీ పరిధిలో 24 మంది వైసీపీ, 9 మంది టీడీపీ కార్పొరేటర్లుగా గెలిచారు. వైసీపీకి మెజారిటీ ఎక్కువగా ఉండటంతో 19వ వార్డు కార్పొరేటర్ బీవై. రామయ్యను మేయర్‌గా ఎన్నుకున్నారు.

● కూటమి విజయంతో మేయర్ పీఠానికి ఎసరు...

ఇటీవలి ఎన్నికల్లో కూటమి తరపున కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా టీజీ భరత్ 20వేలకు పైగా ఓట్లతో గెలిచారు. దీంతో నగర పాలక సంస్థలోని కొందరు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల ముందే వైసీపీకి చెందిన 17, 22వ వార్డు కార్పొరేటర్లు టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ క్రమంలో కౌంటింగ్ పూర్తయిన మరుసటి రోజు నగరంలోని 3,4,6,13వ వార్డులకు చెందిన కార్పొరేటర్లు ఎమ్మెల్యే టీజీ భరత్ సమక్షంలో పార్టీలో చేరారు. దీంతో కర్నూలు అసెంబ్లీ పరిధిలో టీడీపీ కార్పొరేటర్ల సంఖ్య 16కి చేరింది. ఈ నేపథ్యంలో కోడుమూరు నియోజకవర్గం నుంచి ఒకరు, పాణ్యం నియోజకవర్గం నుంచి ఒకరు ఇప్పటికే టీడీపీలో చేరారు. మొత్తం 52 కార్పొరేటర్లు ఉండగా ఇప్పటికే మూడు నియోజకవర్గాలకు సంబంధించి 18 మంది టీడీపీలో ఉన్నారు.

● 27 మంది ఉంటే అవిశ్వాసం..

27 మంది కార్పొరేటర్లు టీడీపీ వైపు ఉంటే అవిశ్వాస తీర్మానం పెట్టి మేయర్‌ను గద్దెనుంచి దింపేయవచ్చు. ఈ క్రమంలో కర్నూలు ఎంపీగా పోటీ చేసిన బీవై. రామయ్య పరాజయం పాలయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉండగా అన్ని పదవులు ఎందుకంటూ గతంలో పార్టీలో కొందరు వ్యతిరేకించడంతో దానిని తొలగించారు. ప్రస్తుతం ఎంపీగా కూడ ఓడిపోవడంతో మేయర్ ఒక్కటే శరణ్యమైంది. ప్రస్తుతం మూడు నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు గెలవడంతో రామయ్య పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. ఎంపీగా ప్రజలు తిరస్కరించారు...మేయర్‌గా కార్పొరేటర్లు వ్యతిరేకిస్తున్నారు. అయితే కోడుమూరు నుంచి ఒకరు, పాణ్యం నుంచి ఐదుగురు, కర్నూలు నుంచి మరో ఐదుగురు టీడీపీలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మెజార్టీ కార్పొరేటర్లు కలిసి మేయర్‌ను తొలగించేందుకు అవిశ్వాసం తీర్మానం పెట్టడానికి రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు



నుజ్జునుజ్జయిన కారు

ఓర్వకల్లు, జూన్ 19: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి 40పై కాల్వబుగ్గ గ్రామ సమీపాన గల కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బళ్లారికి చెందిన వెంకటేశ్ నంద్యాలలో ఓ ఫంక్షన్‌కు వెళ్లి బళ్లారికి వెళ్తుండగా.. కాశిరెడ్డి ఆశ్రమం వద్ద ట్రాక్టరును ఢీకొనడంతో వెంకటేశ్ (50) మృతి చెందాడు. మృతుని తల్లి నాగరత్నమ్మ, డ్రైవర్ విజయ్‌కు గాయాలయ్యాయి. వీరిని హైవే పెట్రోలింగ్ వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి క్రాస్ అవుతున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ట్రాక్టర్ నుజ్జునుజ్జయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

ఓర్వకల్లు, జూన్ 19: మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి 40పై ఓర్వకల్లు గ్రామ సమీపంలోని పవర్‌గ్రిడ్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి రెండు కాళ్లు విరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. ఓర్వకల్లు గ్రామానికి చెందిన నాగరాజు (52) విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు పక్క వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

● ఆర్‌యూ వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్

కర్నూలు(అర్బన్), జూన్ 19: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి బీసుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. బుధవారం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే తరానికి విద్యను అందించబోయే గురువులు అత్యున్నత విలువలను సంతరించుకోవాలని సూచించారు. శిక్షణా సమయంలో నేర్చుకున్న మెలకువలను పాఠశాలల్లో ఆచరిస్తూ విద్యార్థులకు బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్వారీని తనిఖీ చేసిన గనుల శాఖ అధికారులు

కర్నూలు(అర్బన్), జూన్ 19: ఆదోని మండలం కపటి గ్రామంలో సర్వే నెంబర్ 1 దగ్గర ఉన్న గ్రానైట్ క్వారీని తనిఖీ చేశామని గనుల శాఖ డిప్యూటి డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం విజిలెన్స్ ఏడీ భైరాగి నాయుడు, ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు. సదరు గ్రానైట్ క్వారీ పనులు జరగడం లేదని గుర్తించామని పేర్కొన్నారు. తదుపరి చర్యలకు సంబంధించి లీజు దారుడికి నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు.

రేపు జాబ్ మేళా

కర్నూలు(అర్బన్), జూన్ 19: నిరుద్యోగ యువతకు ఈనెల 21న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి పి. దీప్తి తెలిపారు. సి. క్యాంప్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఇంటర్వ్యూలకు గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, ఫోన్‌పే, భారత్ ఫైనాన్షియల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, మెకానిక్ ఆపరేటర్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 13,500 నుంచి రూ. 15 వేలకు వేతనం ఉంటుందని, 18 నుంచి 32 సంవత్సరాల లోపు వయస్సు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నంద్యాల (నూనెపల్లె), జూన్ 19: నంద్యాల ఎన్జీవో కాలనీలో మ్యాన్ హోల్‌లో బుధవారం ఓ మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. నూనె పల్లెకు చెందిన రామకృష్ణ (35) ఫ్లవర్ డెకరేషన్ షాపులో పని చేస్తున్నాడు. అతనికి, నారాయణ అనే మరో వ్యక్తికి మధ్య మూడు రోజుల క్రితం ఎన్జీవోస్ కాలనీలోని కో ఆపరేటివ్ కమ్యూనిటీ హాల్‌లో ఘర్షణ జరిగింది. కమ్యూనిటీ హాల్‌లోని గ్యాస్ సిలిండర్లు అమ్ముకోగా వచ్చిన నగదు పంపకాల మధ్య గొడవ జరిగాక ఆదివారం రాత్రి నుంచి రామకృష్ణ కనిపించలేదని కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా బుధవారం కమ్యూనిటీ హాల్ సమీపంలోని మ్యాన్ హోల్‌లో రామకృష్ణ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల సర్వ జన వైద్యశాల మార్చురీ గదికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు.

ఇంట్లో చోరీ

నంద్యాల (నూనెపల్లె), జూన్ 19: నంద్యాల టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వనగర్ బలిజ పేటలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. వ్యాపారి అయిన నాగేంద్ర కుటుంబ సభ్యులు సోమవారం వెలుగోడు మండలం బోయరేవుల గ్రామంలోని సమీప బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లుగా స్థానికులు గుర్తించి నాగేంద్రకు సమాచారం ఇచ్చారు. ఇంటికి చేరుకున్న నాగేంద్ర బీరువాలోని రూ.2 లక్షల నగదు, 7.50 తులాల బంగారు, పట్టు చీరలు దొంగలు అపహరించినట్లు గుర్తించారు. టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడు నాగేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు.

పోటీ చేసిన అభ్యర్థులు తుది అకౌంట్లు సమర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 19: వ్యయ పరిశీలకులకు పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీ చేసిన అభ్యర్థులు తుది అకౌంట్లు సమర్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి కే మధుసూదన్‌రావు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పోటీ చేసిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై పార్టీల ప్రతినిధులతో, ఏఈవో (అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ ఆఫీసర్)లతో డీఆర్వో కే. మధుసూదన్‌రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఖర్చుకు సంబంధించి తుది అకౌంట్స్ ఈ నెల 25లోగా వ్యయ పరిశీలకులకు సమర్పించాలని అన్నారు. ఈ నెల 28వ తేదీన వ్యయ పరిశీలకులు వచ్చి అభ్యర్థుల అకౌంట్లు పరిశీలిస్తారన్నారు. డిస్ట్రిక్ట్ ఎక్స్‌పెండీచర్ నోడల్ ఆఫీసర్ కే.రమేష్‌బాబు, డీసీవో (డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్) రామాంజనేయులు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ విజయలక్ష్మి, వ్యయ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏడుగురు సీఐలకు స్థానచలనం

కర్నూలు, జూన్ 19: కర్నూలు, అనంతపురం రేంజ్ పరిధిలో ఏడుగురు సీఐలను బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
బి.రామకృష్ణ	ఆన్ రిపాట్రియేషన్ ఫ్రమ్ ఎస్‌హెచ్‌ఆర్‌సీ కర్నూలు	కడప వన్‌టౌన్ యుజీ పీఎస్
సి.భాస్కర్ రెడ్డి	కడప వన్‌టౌన్ యుజీ పీఎస్	వీఆర్, కర్నూలు
కే.రమణారెడ్డి	ప్రొద్దుటూరు రూరల్ సర్కిల్	ఖాజీపేట యుజీ పీఎస్
పి.రామాంజులు	ఖాజీపేట, యుజీ పీఎస్	వీఆర్, కర్నూలు రేంజ్
ఎస్.తేజ మూర్తి	ఆదోని వన్‌టౌన్ యుజీ పీఎస్	చిన్న చౌక్ యుజీ పీఎస్
పి.నరసింహారెడ్డి	చిన్న చౌక్ యుజీ పీఎస్	వీఆర్, కర్నూలు రేంజ్
ఈ.కంబగిరి రాముడు	ఫ్యాక్షన్ జోన్, ప్రొద్దుటూరు	సీసీఎస్, కర్నూలు

ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసినందుకే వైసీపీకి గుణపాఠం

- రాయలసీమ సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



నంద్యాల టౌన్, జూన్ 19 : రాష్ట్రంలో సాగునీటి రంగాన్ని పూర్తిగా అలక్ష్యం చేసి ప్రాజెక్టులను శిథిలావస్థకు దిగజార్చడంతోనే సార్వత్రిక ఎన్నికల్లో జగన్ సారథ్యంలోని వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం నేర్పారని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం, జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన ప్రాజెక్టుల సందర్శన, తదితర కార్యక్రమాల్లో రాయలసీమ సమగ్రాభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉందన్న హామీ మేరకు రాయలసీమ ప్రజలు టీడీపీకి బ్రహ్మరథం పట్టారని పేర్కొన్నారు. రాయలసీమ సమగ్రాభివృద్ధితో పాటు సాగునీటి రంగ అభివృద్ధికి సిద్ధేశ్వరం అలుగు, గుండ్రేవుల రిజర్వాయర్, తదితర నిర్మాణాలతో పాటు కర్నూలులో హైకోర్టు ఏర్పాటు, సీడ్ హబ్, హార్టికల్చర్ హబ్, తదితర అంశాలను ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. రాయలసీమ కూడా ఏపీలో భాగమనే భావనతో సమగ్రాభివృద్ధికి అన్ని కార్యక్రమాలు చేపట్టతామని చంద్రబాబు ప్రకటించడాన్ని సాగునీటి సాధన సమితి ప్రత్యేకంగా ఆహ్వానించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం అరకొరగా సీమలో ఉన్న కొన్ని కార్యాలయాలను తరలిస్తున్నారన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, తరలింపు చేపట్టడంలేదని ప్రభుత్వం ప్రకటిస్తూనే రాయలసీమ అభివృద్ధికి కృషి చేస్తామన్న సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలకు కార్యాచరణ దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని బొజ్జా పేర్కొన్నారు. అత్యంత ప్రాధాన్యతగా ప్రభుత్వం తక్షణమే స్పందించి రాష్ట్ర సమగ్రతకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

లోకేశ్‌ను కలిసిన మల్లెల



నంద్యాల (నూనెపల్లె), జూన్ 19: రాష్ట్ర మానవ వనరులు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్ బుధవారం కలిశారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. నంద్యాల జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ సీట్లను టీడీపీ క్లీన్ స్వీప్ చేయడంపై మల్లెల రాజశేఖర్‌గౌడ్‌ను అభినందించారు.

టీడీపీ బ్యానర్ల దహనం



లింగాపురంలో కాలిపోయిన టీడీపీ నాయకుల బ్యానర్లు

బండిఆత్మకూరు, జూన్ 19: మండలంలోని లింగాపురం గ్రామంలో టీడీపీ బ్యానర్లను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. బుధవారం రాత్రి గ్రామంలో ఏర్పాటు చేసిన టీడీపీ బ్యానర్లపై పెట్రోల్ పోసి కాల్చి వేశారు. అయితే ఇది స్థానిక వైసీపీ నాయకుల పనేనని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న బండిఆత్మకూరు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

నేడు జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన

● గత ఏడాది రబీలో పంట నష్టంపై పరిశీలన

నంద్యాల టౌన్, జూన్ 19 : జిల్లాలో గురువారం కేంద్ర కరువు బృందం పర్యటించనుంది. గత ఏడాది రబీలో జరిగిన పంట నష్టంపై పరిశీలన, సమగ్ర వివరాలను కేంద్ర బృందం ఆరా తీస్తుందని అధికార వర్గాలు వెల్లడించాయి. జిల్లాలోని 13 మండలాల్లో గత ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటల్లో 36,359 హెక్టార్లల్లో పప్పుశనగ, 4116 హెక్టార్లల్లో మినుములు, 2070 హెక్టార్లల్లో పొగాకు, 12908 హెక్టార్లల్లో జొన్న పంటలకు నష్టం జరిగింది. దీనిపై అప్పట్లో వ్యవసాయ శాఖ అధికారులు కేంద్రానికి నివేదిక పంపించారు. ఈ నేపథ్యంలో రబీ సీజన్‌లో జరిగిన పంట నష్టంపై పరిశీలించేందుకు కేంద్ర బృందం ఉమ్మడి జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటన నేపథ్యంలో 20వ తేదీ నంద్యాల జిల్లాలో వివిధ ప్రాంతాల్లో బృందం పర్యటన ఖరారైంది. కేంద్ర కరువు బృందం టీమ్ లీడర్‌గా న్యూఢిల్లీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండేచర్ డైరెక్టర్ ఐఏఎస్ చిన్మయ గాట్‌మేర్, కేంద్ర తాగునీరు, పారిశుధ్య శాఖ డిప్యూటీ సలహాదారుడు ఆశీష్ పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి అరవిందకుమార్ సోనిలతో కూడిన బృందం పరిశీలనకు రానున్నారు. ఇందులో భాగంగా తమ్మరాజుపల్లె వాటర్ స్కీమ్, కోవెలకుంట్ల మండలం భీమునిపాడు, ఉయ్యాలవాడ మండలంలోని హరివరంలతో పాటు పర్యటన మార్గమధ్యంలో మరికొన్ని ప్రాంతాల్లో కేంద్ర బృందం క్షేత్ర స్థాయిలో కరువు వాస్తవ పరిస్థితులపై ఆరా తీయనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. కేంద్ర కరువు బృందం రానున్న నేపథ్యంలో కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే ఆయా మండలాల అధికారులకు కేంద్ర బృందానికి వివరించే వివిధ అంశాలపై కార్యాచరణ సిద్ధం చేశారు. కరువు తీవ్రతను బృందానికి సమగ్రంగా వివరించేలా గత ఏడాది రబీలో దెబ్బతిన్న పంట పొలాలకు సంబంధించి పంట ఫొటోలను ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. పశుగ్రాసం కొరత వల్ల తగ్గిన పాల ఉత్పత్తి, కరువు మండలాల్లో ప్రభుత్వం ద్వారా కూలీలకు కల్పించిన పనులు, మంచినీటి ట్యాంకర్ల ద్వారా కొన్ని ప్రాంతాల్లో చేసిన మంచినీటి సరఫరా, రబీలో సాగైన కొన్ని పంటలకు సాగునీటి సరఫరాకు సంబంధించిన వివరాలను కేంద్ర బృందానికి వివరించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించిన ముఖ్యమైన అధికారులు కేంద్ర కరువు బృందానికి పంట నష్టంపై సమగ్ర వివరాలను అందించేలా చర్యలు తీసుకున్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

రైతుల సమస్యలను తెలుసుకున్న జేసీ

దొర్నిపాడు, జూన్ 19: మండలంలో రబీ పంటలు నష్టపోయిన రైతుల వివరాలను సేకరించేందుకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇంటర్ మినిస్ట్రీరియల్ టీమ్ రానున్నట్లు జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. గురువారం దొర్నిపాడు వ్యవసాయ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వ్యవసాయాధికారి సునీత మాట్లాడుతూ మండలంలో 2023-24 సంవత్సరానికి గాను 3,156 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని అన్నారు. శనగ 1503 మంది రైతులకు గాను 1600 హెక్టార్లు, జొన్న 1876 మంది రైతులకు గాను 1354 హెక్టార్లు, మినుము 155 మంది రైతులకు గాను 140 హెక్టార్లు, వరి 47 మంది రైతులకు గాను 30 హెక్టార్లు, ఇతర పంటలకు సంబంధించి 12 మంది రైతులకు 8 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో వీఏవో మురళీకృష్ణ, పీహెచ్‌వో నాగరాజు, ఏడీఏ సుధాకర్, ఎంపీడీవో సుబ్బారెడ్డి, వెటర్నరీ ఏడీఏ కొండారెడ్డి, వెటర్నరీ డాక్టర్ పావని, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ ఉన్నారు.

రైతులతో ముఖాముఖి

ఉయ్యాలవాడ, జూన్ 19: మండలంలోని హరివరం గ్రామానికి గురువారం మధ్యాహ్నం 12 గంటలకు కేంద్ర కరువు బృందం రానున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజేంద్రకుమార్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో శనగ పంట నష్టంపై రైతులతో రివ్యూ చేయటానికి కేంద్ర బృందం వస్తుందని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి కొలిమిగుండ్ల, అవుకు, సంజామల మండలాల రైతులు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు. కేంద్ర బృంద పర్యటన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో మల్లికార్జున, డీఏవో మురళీక్రిష్ణ, డీహెచ్‌వో నాగరాజు, ఏడీఏ సుధాకర్ పరిశీలించారు.

ట్రాన్స్‌జండర్‌ను మోసం చేసిన యువకుడు

అద్దె ఇంట్లో సహజీవనం
మోసం చేశాడని హైదరాబాదులో ఫిర్యాదు చేసిన బాధితురాలు
తాలూకా స్టేషన్‌ను ముట్టడించిన ట్రాన్స్‌జెండర్ అసోసియేషన్ నాయకులు

ఆదోని రూరల్, జూన్ 19 : పరస్పరం ప్రేమలు పంచుకోడానికి ఇటీవల సోషల్ మీడియా వాహికగా పని చేస్తోంది. ఆదోని మండలం బైచిగేరి గ్రామానికి చెందిన రాముడు, ఆదిలక్ష్మి రెండో కుమారుడు గణేష్ ఎమ్మిగనూరు సమీపంలో ఉన్న ఎర్రకోట కాలేజీలో బి.టెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మూడేళ్ల కింద గణేష్‌కు ఇన్‌స్టాగ్రాంలో ట్రాన్స్‌జండర్ హసిని గౌడ్ పరిచయమైంది. మదనపల్లెకు చెందిన ఓ యువకుడు నాలుగు సంవత్సరాల క్రితం ట్రాన్స్‌జండర్‌గా మారడంతో కుటుంబ సభ్యులు బైటికి పంపించేశారు. ఆ వ్యక్తి హసీని గౌడ్ పేరుతో హైద్రాబాదులో నివాసం ఉంటోంది. ఇన్‌స్టాగ్రాంలో హసీనా, గణేష్ మధ్య స్నేహం ఏర్పడి అది ప్రేమగా మారింది. ఒకరిని విడిచి ఒకరు ఉండలేకపోయారు. అయితే తనకు పిల్లలు కారని, తాను ట్రాన్స్‌జెండర్‌నని, మనం స్నేహితులుగానే ఉందామని హసీనా గౌడ్ గణేష్‌కు చెప్పింది. అయినా పర్వాలేదు.. మన పెళ్లి చేసుకుందామని గణేష్ తేల్చి చెప్పాడు. ఆ తర్వాత గణేష్, హసీని హైదరాబాదులోని సనత్ నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని సహజీవనం ప్రారంభించారు. గణేష్‌ను హసీనా ప్రేమగా చూసుకుంది. రూ.లక్షల్లో గణేష్ కోసం ఖర్చు చేసింది. ల్యాప్‌ట్యాప్, ఖరీదైన సెల్‌ఫోన్ కొనిచ్చింది. అడిగినప్పుడల్లా రూ.లక్షల్లో డబ్బు ఇచ్చింది.

పెళ్లి చేసుకోమంటే ఊడాయించాడు... : సహజీవనంలో ఉంటున్న తనను పెళ్లి చేసుకోమని హసీనా కోరింది. దానికి గణేష్ అంగీకరించలేదు. కొన్ని రోజుల క్రితం తన సహచర ట్రాన్స్‌జండర్‌లతో కలిసి గణేష్‌ను నిలదీసింది. వారి నుంచి తప్పించుకొని గణేష్ సొంత గ్రామమైన బైచిగేరికి చేరుకున్నాడు. దీంతో ప్రేమ పేరుతో తనను మోసం చేశాడని, లక్షల్లో డబ్బులు ఇచ్చానని గణేష్‌పై హైదరాబాదులోని సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో హసీనా ఫిర్యాదు చేసింది. పోలీసులు గణేష్‌పై 420, 417 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.



ట్రాంజెండర్ హసిని గౌడ్‌తో ప్రియుడు బైచిగేరి గణేష్

వారం రోజుల క్రితం తాలూకా స్టేషన్‌ను ముట్టడి : ప్రేమ పేరుతో తనను మోసం చేయడంతో పాటు చంపేస్తానని గణేష్, అతని అన్న ఫోన్‌లో బెదిరిస్తున్నారని వారం కిందట హసీనా, ఇతర ట్రాన్స్‌జండర్లు ఆదోని తాలూకా పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. తనకు న్యాయం చేయాలని సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్.ఐ ఎర్రిస్వామిలను కోరింది.

హైదరాబాదు సీఐ ఫోన్ చేశారు: ఎర్రిస్వామి, తాలుకా ఎస్ఐ ఆదోని

హైద్రాబాదుకు చెందిన ట్రాంజెండర్ హసీనా హైదరాబాదులోని సనత్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో.. అక్కడి సీఐ నాకు ఫోన్ చేసి బాధితురాలికి సహకరించాలని కోరారు. గణేష్ కుటుంబ సభ్యులు హసీనాను బెదిరించినట్లు ఆధారాలు ఉన్నాయి. అలాగే హసీనా గౌడ్‌ను గణేష్ మోసగించాడనడానికి కూడా పూర్తి ఆధారాలు ఆమె దగ్గర ఉన్నాయి. ఈ మేరకు చర్యలు తీసుకుంటాం.

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా
చర్యలు తీసుకోండి: కమిషనర్


మాట్లాడుతున్న కమిషనర్ భార్గవతేజ

కర్నూలు(కల్చరల్), జూన్ 19: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య, ఇంజనీరింగ్ విభాగాల అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ ఆదేశించారు. బుధవారం సంస్థ కౌన్సిల్ సమావేశ హాలులో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, హెల్త్ అసిస్టెంట్లతోపాటు ఇంజనీరింగ్ విభాగపు అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవతేజ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం తప్పనిసరిగా తమతమ సచివాలయ పరిధిల్లో ఏఎన్ఎంలు పర్యటించాలని, ఎక్కడైనా గుంతలు, పాత టైర్లు, పాత కూలర్లు, బాటిళ్లలో నీటి నిల్వ లేకుండా చూడాలని అన్నారు. అలాగే వాటివల్ల కలిగే అనర్థాలను ప్రజలకు అవగాహన కల్పించాలని, క్రమం తప్పకుండా రెండు వారాలకు ఒకసారి ప్రతి ఇంటా పారిశుధ్యం పనులు, హైపో క్లోరైడ్ ద్రావణం పిచికారీ చేయాలని అన్నారు. తాగునీటి ట్యాంకుల్లో బ్లీచింగ్, క్లోరినేషన్ చేయాలని, సరఫరా చేసే క్రమంలో నీరు ఎక్కడా కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఆరోగ్య అధికారి విశ్వేశ్వర్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న మలేరియా అధికారి నూకరాజు

సి.బెళగల్, జూన్ 19: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి నూకరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఎంపీడీవో శకుంతల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని గ్రామాలలో తాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు దృష్టి పెట్టాలన్నారు. అలాగే ఈనెల 18 తేదీ నుంచి 30 వరకు మలేరియా వ్యతిరేక మహోత్సవ దినంగా నిర్వహిస్తామన్నారు. వైద్యాధికారి సునిత, ఎంపీడీవో శకుంతల, ఈవో ఆర్డీ సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్, రంగస్వామి పాల్గొన్నారు.

యాదవ ఎంపీ, ఎమ్మెల్యేలకు అభినందన

కర్నూలు(కల్చరల్), జూన్ 19: రాష్ట్రంలో టీడీపీ కూటమిలో గెలుపొందిన యాదవ కుల ఎంపీ, ఎమ్మెల్యేలకు యాదవ సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. బుధవారం నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోగల యాదవ హక్కుల పోరాట సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో గెలిచిన ఎంపీ, ఎమ్మెల్యేలకు అభినందనలు తెలిపారు. వై. సత్యకుమార్ యాదవ్‌కు, కొలుసు పార్థసారథి యాదవ్‌కు మంత్రి వర్గంలో స్థానం కల్పించినందుకు, టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని పల్లా శ్రీనివాస యాదవ్‌కు ఇచ్చినందుకు టీడీపీ నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయ్యన్న యాదవ్, గౌరవాధ్యక్షుడు జేవీ కృష్ణయ్య యాదవ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు టి. శ్రీరాములు యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, మహిళా నాయకులు విజయలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.

నేడు సామూహిక వివాహాలు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 19: ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని చౌక్‌బజార్ బీబీ ఫంక్షన్ హాలులో గురువారం సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. గత 16 సంవత్సరాల నుంచి కమిటీ ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు జరిపిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. పేద ముస్లిం వధూవరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 19: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఎడారి భూములు పునరుద్ధరణ అనే అంశంపై బుధవారం విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రతి పాఠశాలలో జూన్ 13వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 6 నుంచి 9వ తరగతుల విద్యార్థులకు పర్యావరణపై సమగ్ర అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. మాంటిస్సోరిలో గ్రీనిస్ ఎకో క్లబ్ పేరిట పర్యావరణ పరిరక్షణ ర్యాలీ, మొక్కలు నాటడం, సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఆవశ్యకత కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వాములు అయ్యారు. కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ కృష్ణమోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాజ్యోతి, జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎందుకు ఓడారో జడ్పీటీసీలను అడగండి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 19: ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఎందుకు ఓడిపోయిందో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను అడగాలని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 14, 15 ఆర్థిక సంఘం నిధులు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన రూ.30 వేల కోట్లను దొంగలించారని అన్నారు. గత ఐదేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి వందకు పైగా తప్పులను విస్మరించి ఓటమిలో ఈవీఎంల పాత్ర ఉందని అనుమానం వ్యక్తం చేయడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

ఓర్వకల్లు, జూన్ 19: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాజీ ఎంపీపీ లక్ష్మణ్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని హుశేనాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను మాజీ ఎంపీపీ లక్ష్మణ్‌రావు, గ్రామ సర్పంచ్ చంద్ర గోవర్ధనమ్మ, ఎంపీటీసీ చిన్నమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్రపెద్దస్వామి, సుధాకర్, నాయకులు మహబూబ్‌బాషా పాల్గొన్నారు.



చౌక ధరకు టమోటా పంపిణీ

కిలో రూ.62 ప్రకారం రైతు బజార్లలో విక్రయం


సి.క్యాంపు రైతుబజారులో తక్కువ ధరకే టమోటాలను విక్రయిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 19: రైతు బజార్లలో బుధవారం చౌక ధరకు టమోటా పంపిణీ చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల టమోటా పంట సాగు గణనీయంగా తగ్గిపోయింది. బోర్లు, బావుల కింద కొంత మేర సాగు చేసిన టమోటాలు ప్రస్తుతం మార్కెట్‌లో అమ్మకానికి రైతులు తెస్తున్నారు. ఉత్పత్తి తగ్గిపోయి డిమాండ్ బారీగా పెరిగిపోయింది. చిల్లరగా టమోటాను కిలో రూ.100కు విక్రయిస్తున్నారు. దీంతో ప్రజల నుంచి పెద్దఎత్తున నిరసన వ్యక్తమవుతుండటంతో ప్రభుత్వ ఆదేశాలపై మార్కెటింగ్ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. కర్నూలు, నంద్యాల జిల్లాల మార్కెటింగ్ శాఖ ఏడీఎంలు నారాయణమూర్తి, రహిమాన్‌లు రైతుబజార్ల ద్వారా కిలో టమోటాలను రూ.62కు విక్రయించేందుకు చర్యలు చేపట్టారు. బుధవారం సీ క్యాంపు రైతుబజారులో 62 బాక్సుల టమోటాలను వినియోగదారులకు ఏడీఎం నారాయణమూర్తితో పాటు ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్, సెక్యూరిటీ గార్డులు శ్రీనివాసరెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్, సెక్యూరిటీ గార్డులు చిన్నస్వామి, గోపాల్, హనుమంతు, గురువయ్య సాక్షిగా ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు. అదేవిధంగా అమీన్ అబ్బాస్‌నగర్‌లో 30 బాక్సులు, కొత్తపేట రైతు బజారులో 30 బాక్సులు మొత్తం 160 బాక్సుల టమోటాలను వినియోగదారులకు అందించగలిగామని ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. ధరలు తగ్గేంత వరకు నోలాస్, నో బెనిఫిట్స్ ప్రాతిపదికను టమోటాలను వినియోగదారులకు అందిస్తామని ఏడీఎం స్పష్టం చేశారు.

సికిల్‌సెల్‌ను నిర్మూలించాలి


పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), జూన్ 19: సికిల్‌సెల్ ఎనిమియాను నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ముందుకెళ్తున్నట్లు డీఎంహెచ్‌వో డా.వై.ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆయన ప్రపంచ సికిల్‌సెల్ అవగాహన దినోత్సవం సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. సికిల్ సెల్ అనేది అంటు వ్యాధి కాదని, ఇది వంశపారంపర్యంగా వస్తుందన్నారు. ఇది ఎర్రరక్త కణాలు, గోళాకారంగా ఉండి రక్తనాళాల గుండా సులభంగా వెళ్లేలా చేస్తాయన్నారు. కానీ సికిల్‌సెల్‌లో కొన్ని ఎర్ర రక్త కణాలు చంద్రవంక ఆకారంలో ఉంటాయన్నారు. ఈవ్యాధి ఉన్న వారికి రక్తహీనత, కళ్లు పసుపురంగులోకి మారడం, కీళ్లనొప్పులు ఉంటాయన్నారు. ఆర్‌బీఎస్‌కే పీవో హేమలత, డీపీహెచ్‌ఎన్‌వో ఇందిర, హెచ్ఈఈవో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్), జూన్ 19: పదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆయుష్, కర్నూలు నగర పాలక సంస్థ, జిల్లా యువజన, క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయుష్ శాఖ జిల్లా ఆఫీసర్ డా.టి.చంద్రశేఖర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో ఉదయం 6 గంటల నుంచి 8.30 గంటల వరకు యోగా కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు, జిల్లా యోగా సంస్థ జిల్లా ఆరోగ్య భారతీశాఖ, పతంజలి యోగా సంస్థ, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, పోలీసులు పాల్గొంటారన్నారు.

నీట్ ఫలితాలపై విచారణ జరిపించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 19: మెడికల్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రమణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 67 మంది విద్యార్థులకు 100/100 మార్కులు రావడం, అందులో ఆరుగురు విద్యార్థులు ఒకే సెంటర్‌కు సంబంధించిన వారు కావడంతో అనేక అనుమానాలకు తావిస్తోందని అన్నారు.

సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివ నారాయణ


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 19: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివ నారాయణ అన్నారు. బుధవారం కర్నూలు పార్లమెంటు బీజేపీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ ఆధ్వర్యంలో స్థానిక నంద్యాల చెక్‌పోస్టు నందు దేవీ ఫంక్షన్ హాలులో కర్నూలు పార్లమెంటు ఎన్నికల సమీక్ష సమావేశం నిర్వహించారు. బిట్రా శివనారాయణ మాట్లాడుతూ టీడీపీ జనసేన, బీజేపీ కార్యకర్తల సమూహమే ఈ విజయానికి కారణమని క్షేత్ర స్థాయిలో భారతీయ జనతా పార్టీ బూత్ స్థాయిలో తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని అన్నారు. అదేవిధంగా ప్రతి సంక్షేమ పథకాలు చిట్టచివరణ పేదవాడికి అందేలాగా చూడాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర, చంద్రమౌళి, సావిత్రీ, అంకాల్ రెడ్డి, సాయి ప్రదీప్, ప్రేమ్ కుమార్, ఉపేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



రాహుల్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కేక్ కట్ చేస్తున్న లక్ష్మీనరసింహ

కర్నూలు(అర్బన్), జూన్ 19: జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే. బాబురావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు నెరవేర్చడంతోపాటు రాష్ట్ర భవిష్యత్ రాహుల్ గాంధీ చేతుల్లో ఉందన్నారు. అంతక ముందు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, దామోదరం రాధాకృష్ణ, జాన్ విల్సన్, పీజీ నరసింహులు యాదవ్, బీ.రామాంజ నేయులు యాదవ్, బీ. బ్రతుకన్న పాల్గొన్నారు.

● అమ్మ అనాథశ్రమంలో.. నగర శివారులోని అమ్మ అనాథశ్రమంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే.బాబురావు, కోడుమూరు నియోజకవర్గం సమన్వ యకర్త పి.మురళీకృష్ణల ఆధ్వర్యంలో అనాథ ఆశ్రమంలోని పిల్లల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం పిల్లలకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనాథ ఆశ్రమ నిర్వాహకుడు సతీష్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు లాజరస్, ప్రతాపరెడ్డి, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ నాయకత్వం దేశానికి అవసరం

కల్లూరు: రాహుల్‌గాంధీ నాయకత్వం భారతదేశానికి ఎంతో అవసరమని కాంగ్రెస్ నంద్యాల జిల్లా డీసీసీ అధ్యక్షుడు జే.లక్ష్మీనరసింహ అన్నారు. రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా జే.లక్ష్మీనరసింహ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గణనీయమైన ఓట్లు, సీట్లు సాధించిందన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కూటమికి 240 సీట్లు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి, బోయ రమణ, మైనార్టీ నాయకులు జాకీర్‌హుసేన్, ఆసిఫ్ ప్రసాద్ పాల్గొన్నారు.

పంటలను కాపాడి రైతును రక్షిద్దాం

కేవీకే ప్రిన్సిపాల్ ధనలక్ష్మి పిలుపు


మాట్లాడుతున్న కేవీకే ప్రిన్సిపాల్ ధనలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 19 : రాష్ట్రంలోనే పత్తిపంట సాగులో మొదటి స్థానంలో నిలిచిన ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని యాగంటిపల్లి కేవీకే హెడ్ అండ్ ప్రిన్సిపాల్, సైంటిస్టు డా. ధనలక్ష్మి వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితర వివిధ రంగాలకు చెందిన వారికి పిలుపునిచ్చారు. బుధవారం చెన్నైకి చెందిన నేషనల్ ఆగ్రో ఫౌండేషన్, వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా పత్తిపంట అధికోత్పత్తికి తీసుకోవాల్సిన చర్యలపై సెమినార్ నిర్వహించాయి. అగ్రి అడాప్ట్ క్లైమేట్ రిస్క్ టూల్ ఫర్ కాటన్ వాల్యూచైన్ అనే అంశంపై నిర్వహించిన ఈ సెమినార్‌లో జిల్లాలోని వ్యవసాయాధికారులు పాల్గొన్నారు. అనంతపురం, నంద్యాల, బనగానపల్లె, కర్నూలు చెందిన ప్రధాన శాస్త్రవేత్తలు నరసింగరావు కూడా ఈ సెమినార్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఏఎఫ్ ఈడీ డా. ఎం ఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల పత్తి ఉత్పత్తికి ఎన్నో ఆటంకాలు ఎదురవుతున్నాయని, వీటిని నివారించి పత్తి రైతులను గట్టెక్కించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శాలురెడ్డి, గిరీష్, శాస్త్రవేత్తలు అశోక్ కుమార్, రామక్రిష్ణారావు పాల్గొన్నారు.

ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి


డీఆర్వోకు వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 19: 2024 సార్వత్రిక ఎన్నికల్లో అనారోగ్య కారణాలతో విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయులు, ఉద్యోగుల సస్పెన్షన్‌లను రద్దు చేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమైక్య ప్యాప్టో జిల్లా చైర్మన్ ఎస్.గోకారి, సెక్రటరీ జనరల్ జి.తిమ్మప్ప, సభ్య సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. డీఆర్వో స్పందిస్తూ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీకే జనార్దన్, ఎం.రంగన్న, ఐ.మరియానందం, సేవాలాల్ నాయక్, యు.భాస్కర్, మహ్మద్ రఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోంమంత్రికి సన్మానం


వంగలపూడి అనితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కే పార్వతమ్మ

కల్లూరు, జూన్ 19: రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను నంద్యాల జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు కే.పార్వతమ్మ ఘనంగా సన్మానించారు. బుధవారం హోం మంత్రి చాంబర్‌లో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఝాన్సీతో కలిసి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో మహిళల రక్షణ కొరవడిందని టీడీపీ ప్రభుత్వంలో మహిళా రక్షణకు కృషి చేయాలని కోరారు.

ఎమ్మెల్యేలకు అభినందన


ఎమ్మెల్యే కోట్లను అభినందిస్తున్న వైద్యసిబ్బంది

కోడుమూరు(రూరల్), జూన్ 19: లద్దగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది బుధవారం కోడుమూరు, డోన్ ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ అధ్వర్యంలో ముందుగా లద్దగిరిలోని నివాసంలో ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. అలాగే పసుపల గ్రామంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని కలిసి సన్మానించారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ మంచి వైద్యసేవలు అందించి పీహెచ్‌సీకి మంచి పేరు తీసుకరావాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసయాదవ్ సీహెచ్‌వో శాంత, శారదమ్మ, రఫీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న టోల్ ప్లాజా ప్రాజెక్టు హెడ్ మదనమోహన్

ఓర్వకల్లు, జూన్ 19: రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని కర్నూలు, కడప టోల్ ప్లాజా ప్రాజెక్టు హెడ్ మదనమోహన్ సూచించారు. బుధవారం మండల కేంద్రమైన ఓర్వకల్లులో నాగరాజు రోడ్డు వెంట నడుచుకుంటూ ప్రమాదానికి గురి కావడంతో ఓర్వకల్లు బస్టాండులో ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మదనమోహన్ మాట్లాడుతూ రోడ్ల వెంట ప్రజలు వెళ్లకూడదని, వాకింగ్ చేయరాదని, విశాలమైన ప్రదేశాల్లో, పాఠశాల సమీపంలోని ఆట స్థలాల్లో వాకింగ్ చేసుకోవాలని సూచించారు. రోడ్డు వెంట వాకింగ్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా హైవే సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన కోడుమూరు ఎమ్మెల్యే


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి, విష్ణు

కర్నూలు, జూన్ 19: ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను బుధవారం తన కార్యాలయంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలపై వారు చర్చించారు.

కరాటే విజేతకు టీజీ వెంకటేశ్ అభినందన


కరాటే విజేతను అభినందిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 19: ఇటీవల పూణేలో నిర్వహించిన 3వ ఆసియా కరాటే చాంపియన్‌షిప్‌లో అండర్ 15 విభాగంలో షాన్‌మీరజ్ బంగారు పతకం సాధించాడు. పోటీల్లో శ్రీలంక, ఖజకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్, బెల్జియం దేశాలకు చెందిన కరాటే మాస్టర్స్ పోటీల్లో తలపడ్డారు. ఈ సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ విజేతను అభినందించారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజర్ ఎస్.మౌలాలి, ఖలీల్ అహ్మద్, జోమేజ్ అర్మాన్ పాల్గొన్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి


మాట్లాడుతున్న శ్రీరాములు

కర్నూలు(అర్బన్), జూన్ 19: ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మన్ బి.శ్రీరాములు డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నవ్యాంధ్ర విద్యార్థి యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యస్వామితో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు లక్ష లక్ష పోస్టు కార్డులు, ఎస్ఎంఎస్‌ల ద్వారా ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హేమచంద్రారెడ్డి ప్రభుత్వ సొమ్ము దోచుకుని బెంగళూరు, హైదరాబాద్, చెన్నయ్, కర్నూలు నగరాల్లో వందల కోట్ల అక్రమ ఆస్తులు కూడగట్టారని అన్నారు. ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న, లక్ష్మణ్, చిన్న, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలిలో ఎంఎస్సీ విద్యార్థుల ఫేర్‌వెల్



మాట్లాడుతున్న విజయవర్ధన్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జూన్ 19: కర్నూలు నగరం గాయత్రీ ఎస్టేట్‌లోని గీతాంజలి నర్సింగ్ కళాశాలలో ఎంఎస్సీ నర్సింగ్ బ్యాచ్ (2022-24) విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల అధినేత కరస్పాండెంట్ పెరుగు విజయ్‌వర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

'వృద్ధాప్యంలో ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి'

కర్నూలు(కల్చరల్), జూన్ 19: వృద్ధాప్యంలో ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు వృద్ధులకు సూచించారు. బుధవారం నగరంలోని గురుబ్రహ్మ నగర్‌లో వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు వైద్య శిబిరం నిర్వహించారు. కంటివైద్య నిపుణుడు డాక్టర్ జయప్రకాశ్, జనరల్ ఫిజీషియన్ రంగనాయక, డాక్టర్ బాలీశ్వర్‌లు పాల్గొని వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

కొత్త రోడ్లు వేయాలి: సీపీఎం


గుంతల రోడ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 19: నగరంలో కొత్త రోడ్లు వేయాలని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ప్రధాన రహదారులతోపాటు కాలనీల్లోని రోడ్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ నగరంలోని కొన్ని ప్రాంతాలలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. కొత్తబస్టాండు సమీపంలోని సుందరయ్య సర్కిల్, గాయత్రి హాస్పిటల్, అద్వా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు వెళ్లే రోడ్డు పెద్ద పెద్ద గుంతలు పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత ప్రభుత్వం గుంతల రోడ్లకు మరమ్మతులు కూడా చేయలేదని విమర్శించారు. శివారు కాలనీలలో రోడ్ల పరిస్థితి ఇంకా అధ్వానంగా ఉందని, చిన్న వర్షం వచ్చిందంటే చాలు చెరువును తలపిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాజశేఖర్, కే.ప్రభాకర్, కుమారి, పర్వీన్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా జలజీవన్ మిషన్ పనులు





గోనెగండ్లలో అసంపూర్తి గా ఉన్న ఓహెచ్ఆర్ ట్యాంక్, ఎస్ఎస్ ట్యాంక్, తిప్పనూరులో గతంలో ఏర్పాటు చేసిన నీటి గుమ్మి

- ఏడు గ్రామాల్లో ఐదేళ్లుగా పూర్తికాని పనులు
- వైసీపీ ప్రభుత్వంలో నిధులు లేక సగంలోనే వదిలేసిన కాంట్రాక్టర్లు
- టీడీపీ ప్రభుత్వంలో పనులు సాగుతాయని గ్రామస్థులలో ఆశలు

గోనెగండ్ల, జూన్ 19: గ్రామాల్లో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. తాగునీటి సమస్యలను తీర్చేందుకు గాను మండల కేంద్రం గోనెగండ్లతో పాటు వేముగోడు, తిప్పనూరు, బోదేపాడు, కున్నూరు, కులుమాల గుల్లమరుసు, గ్రామాలకు జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులను కేంద్ర ప్రభుత్వం 50 శాతం వాట కింద, రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం వాట కింద విడుదల చేయాల్సి ఉంది. అప్పటి వైసీపీ ప్రభుత్వం తన వంతు 50 శాతం నిధులను విడుదల చేయకపోగా కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలయిన నిధులను ఇతర పనులకు మళ్లించింది. దీంతో పనులు ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఎన్నికలు సమీపించడంతో వైసీపీ ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆరు నెలల నుంచి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లను ముందుకు తెచ్చారు. గోనెగండ్లలో పనులకు గాను 3.51 కోట్లు మంజూరు అయ్యాయి. కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ రూ. 20 లక్షల పనులు చేసినిధులు విడుదల కాక పోవడంతో పనులను మధ్యలోనే వదిలేశారు. ఇక వేముగోడు గ్రామానికి రూ. 50 లక్షలు మంజూరు అయినప్పటికీ రూ. 24 లక్షలతో గ్రామంలో సగం పనులు చేసి మిగతా పనులను మధ్యలో వదిలి వేశారు. కులుమాల, రూ. 52 లక్షలు, బోదేపాడుకు రూ. 50 లక్షలు, కున్నూరుకు రూ. 52 లక్షలు, తిప్పనూరు, రూ. 50 లక్షలు, గుల్లమోరుసు గ్రామానికి కూడా నిధులు విడుదల చేశారు. ఈ నిధులు జీవో నెం ఆర్టీ 56 కింద ఈ గ్రామాలకు నిధులు విడుదలయ్యాయి. అయితే, ఈ గ్రామాల్లో కాంట్రాక్టర్లు సగం పనులు చేసి నిధులు విడుదల కాకపోవడంతో పనులను మధ్యలోనే వదిలేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గ్రామాల్లో మాత్రం తాగునీటి సమస్య తీరడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో పనులు చేస్తే బిల్లులు రావని చాలా మంది కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారి టీడీపీ అధికారంలోకి వచ్చింది. సీఎం చంద్రబాబు గ్రామాల అభివృద్ధి, తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతారని, జలజీవన్ మిషన్ పనులు వేగవంతం అవుతాయని గ్రామస్థులు ఆశతో ఎదురు చూస్తున్నారు.

త్వరలో పనులు పూర్తి చేస్తాం

టెండర్ పక్రియ చాలా గ్రామాల్లో పూర్తయ్యింది. గతంలో పనులు చేసేందుకు వచ్చిన కాంటాక్టర్లు పనులను మధ్యలో వదిలేశారు. కొన్ని గ్రామాల్లో పాత టెండర్‌ను రద్దు చేసి కొత్త టెండర్ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తాం. ఇక కొత్త ప్రభుత్వంలో పనులు త్వరగా జరిపి గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం.

\- శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గోనెగండ్ల

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోండి : డీపీఓ

వెల్దుర్తి, జూన్, 19 : మండలంలో తాగునీరు కలుషితం కాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి నాగరాజు నాయుడు అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో డ్రెయిన్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి నాగరాజు నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం వెల్దుర్తిలో ఆకస్మికంగా పర్యటించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ నాగరాజు నాయుడు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో నీరు సరఫరా చేసే మంచినీటి పైపులు లీక్ కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కలుషిత నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడకుండా క్షేత్రస్థాయి అధికారులు పనిచేయాలన్నారు. పట్టణంలో నీటి సమస్య పరిష్కరించాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి ఓవర్ హెడ్ ట్యాంకు శుభ్రం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో గ్రీన్ అంబాసీడర్లు చెత్తను యథావిధిగా సేకరించి రీసైక్లింగ్ షెడ్డుకు తరలించాలని, కాలువలు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధపెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నరసింహులు, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ మునెయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న డీపీఓ నాగరాజునాయుడు

జింకల నుండి పంటలను కాపాడండి

ఆస్పరి, జూన్ 19: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వేసిన పంటలను జింకలబారీ నుంచి రక్షించాలని రైతు సంఘం అఖిల భారత రైతు మహాసభ సంఘం జిల్లా నాయకుడు మునిస్వామి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలను జింకలు మొలక దశలోనే తినేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి, సజ్జ, కంది, టమోటా, మిరప చోళకాయ పంటలపై గుంపులు గుంపులుగా సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. 2008 చట్టం ప్రకారం జింకల బారి నుంచి నష్టపోయిన పంటలకు ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే జింకల పార్కును ఏర్పాటు చేసి రైతు పంటలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో హనుమంతు, రంగస్వామి, రాజ్‌కుమార్, జనసేన పార్టీ నాయకులు అన్వేష్ పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పాఠశాల విద్యార్థికి తీవ్ర గాయాలు

హాలహర్వి, జూన్ 19: గూళ్యంలో కన్నడ పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న వంశీ అనే విద్యార్థిమీద బుధవారం గేటు పడి తీవ్రంగా గాయపడినట్లు గ్రామస్థులు తెలిపారు. నాడు.. నేడు పనులు ఆ పాఠశాలలో అర్థాంతరంగా ఆగిపోయాయని, పనులు పూర్తి కాకపోవడంతో పాఠశాల ఆవరణలో ఆడుకుంటుండగా గేటు ఊడిపోయి బాలుడిపై పడడంతో ఈ ప్రమాదం జరిగింది. విద్యార్థికి రక్తపు గాయాలు కావడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వెంటనే వంశీని మెరుగైన చికిత్స కోసం బళ్లారి ఆసుపత్రికి తీసుకెళ్లారు.

రాంజల చెరువు నుంచి తాగునీరు అందజేస్తాం

ఆదోని టౌన్, జూన్ 19: రాంజల చెరువు నుంచి పట్టణ ప్రజలకు తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. బుధవారం ఆర్&బీ గెస్ట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, బీసీ హాస్టళ్లలో గదుల కొరతతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. పట్టణంలో ప్రధాన రహదారులు గుంతలమయం కావడంతో వాటి ప్యాచ్‌వర్క్‌లను కూడా చేయాలని ఆర్&బీ అధికారులతో చర్చించామన్నారు. అందుకు అవసరమయ్యే నిధుల కోసం రూ.1.50 కోట్లు అవసరమవుతుందని, అందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, గుడిసె కృష్ణమ్మ, రాజశేఖర్, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

ఆస్పరి, జూన్ 19: మండలంలోని తురవగల్లు గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం గ్రామ టీడీపీ నాయకులు టీఎన్ఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు సిద్ధప్ప, వార్డ్ మెంబర్ హనుమేష్ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన రెండు, మూడు రోజుల్లోనే వినూత్న కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమన్నారు. గత వైసీపీ పాలనలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పాఠ్యపుస్తకాలు నెల రోజులు గడిచినా పంపిణీ చేసేవారు కాదని విమర్శించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ శ్రీనివాసులు, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తురవగల్లు గ్రామంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పత్తి పంటకు దోమ పోటు

● ఆందోళనలో పత్తి రైతులు

గోనెగండ్ల, జూన్ 19: బావులు బోర్ల కింద ముందుగా సాగు చేసిన పత్తి పంటకు పచ్చ దోమ, ఎర్రదోమ తెల్లదోమ, ఎర్రనల్లి, తామర పురుగు సోకింది. దీంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. కష్టపడి సాగు చేసి పంటలకు చిడపీడలు సోకడం తలలు పట్టుకున్నారు. ముందు జాగ్రత్తలు తీసుకుంటే ఎర్రతెగులు, పచ్చదోమ నివారణ సాధ్యం అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో చాలా ప్రాంతాల్లో ఎండ వేడిమికి పత్తి పంటకు ఎర్రతె గులు, పచ్చదోమ సోకి పంట దెబ్బతింటోంది. ఎమ్మిగనూరు డివిజన్‌లో ఇప్పటి వరకు అత్యధికంగా 12వేల హెక్టార్లలో పత్తి పంట సాగు అయింది. అయితే దాదాపు వెయ్యి ఎకరాల పైగానే ఎండవేడిమి తాళలేక పంట కు పచ్చ దోమ, ఎర్రదోమ తెల్లదోమ, ఎర్రనల్లి, తామర పురుగు, ఎర్రతెగులు సోకిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వీటి నివారణ కోసం 14:0:35 మందును ఒక లీటర్ నీటికి 5గ్రాములు కలుపుకొని సాయంత్రం వేళలో పిచికారి చేసుకోవాలని ఈ పిచికారి తరువాత ఐదు రోజులకు ఫార్ములేషన్ 4లేదా ఫార్ములేషన్ 6 లను ఒక లీటర్ నీటికి 5గ్రాములు కలుపుకొని పిచికారి చేయాలని సూచించారు.

పాలెగాళ్ల పాలనలో అ 'పూర్వ' నిర్మాణాలు



కళాత్మకంగా నిర్మించిన కప్పట్రాళ్లలోని పరమప్పనాయుడు బావి

దేవనకొండ ,జూన్ 19: రాయలసీమ పాలెగాళ్ల పరిపాలనలో వందల ఏళ్ల క్రితం నిర్మితమైన అపూర్వ బావుల నిర్మాణాలు నేటికీ చెక్కుచెదరని సాజీవ సాక్షాలు. పత్తికొండ పరిసర ప్రాంతంలో పంచె పల్లెలు కప్పట్రాళ్ల, పి.కోటకొండ, తెర్నేకల్, పందికొన, పత్తికొండ లను పాలెగాళ్ల పరిపాలించారు. నాటి పాలెగాళ్ల పాలనలో సుందరమైన, కళాత్మకమైన బావులు నిర్మించారు. ఐదువందల ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన బావులలో అపూరూపమైన చిత్రాలు నేటికీ చెక్కు చెదరలేదు. మండలంలోని కప్పట్రాళ్లలోని శివాలయం వద్ద పరమప్పనాయుడు బావి ,పీర్లబావి ,పీ.కోటకొండలోని రాంబావి నేటికి సుందరంగా చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

ఎండు మిర్చి ధర పతనం

● క్వింటాలు గరిష్ఠంగా రూ.9090



ఆదోని మార్కెట్లో విక్రయానికి వచ్చిన ఎండుమిర్చి

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 19: ఎండుమిర్చి ధరలు రైతులను మరింత కృంగతీస్తున్నాయి. ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎండు మిర్చి ధరలు భారీగా పతనమయ్యాయి. బుధవారం ఎండుమిర్చి ధర క్వింటాలు గరిష్ఠంగా రూ.9090 పలికింది. గత 15 రోజులతో పోల్చితే క్వింటానికి రూ.6వేలకు పైగా ధర పడిపోయింది. దీంతో ఎండుమిర్చి సాగు చేసిన రైతులు ధరల పై ఆందోళన చెందుతున్నారు. సాగు పెట్టుబడి ఖర్చులు కూడా అందే పరిస్థితి లేదని కన్నీరు కారుస్తున్నారు. ఈ ఏడాది సాగు చేయాలా..లేదా..? అనే అయోమయంలో ఉన్నామని రైతులు పేర్కొంటున్నారు. 131 క్వింటాళ్ల ఎండుమిర్చి విక్రయానికి రాగా, కనిష్ట ధర రూ.3010, గరిష్ఠధర రూ.9090, మధ్యస్థ ధర రూ.7270 పలికింది.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

ఆదోని టౌన్, జూన్ 19: కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రాహుల్ గాంధీ 54వ జన్మదిన వేడుకలను బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ పాలన పై ప్రజలు విసుగు చెంది కాంగ్రెస్ పాలననే కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దిలీప్ దోఖా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు, పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, రామకృష్ణా రెడ్డి, దేవిశెట్టి వీరేష్, మోహన్ రెడ్డి, హుసేన్ పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుదాం

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 19: ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు అందరి సమిష్టి కృషితో ఆదాయాన్ని పెంచుదామని ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫి అన్నారు. బుధవారం డిపోలో ఆదర్శ ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ఖర్చుల నిర్వాహణ భారంతో ఆర్టీసీ నష్టాల్లో ఉందని అన్నారు. ఆర్టీసీ నష్టా నుంచి గట్టెంక్కించాలంటే ప్రయాణికుల మన్ననలు పొంది సురక్షితంగా వారిని గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. డ్రైవర్లు, రంగన్న, గోవిందు, కండక్టర్లు పోతన్న, పంపన్న, రంగన్న, దౌల, వీరేశప్ప, వెంకటేశ్వర్లు, మెకానిక్‌లు సుధాకర్, షరీఫ్, బ్రహ్మయ్యలను సన్మానించారు.

పట్టణాభివృద్ధిపై దృష్టి పెట్టండి

ఆదోని టౌన్, జూన్ 19: పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించడంలో చొరవచూపాలని మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య, ఎమ్మెల్యే డా. పార్థసారథికి సూచించారు. బుధవారం పార్థసారధి రామయ్యను మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆరోగ్యం గురించి వాకబు చేశారు. ఆదోనిలో ఎమ్మెల్యేగా విజయం సాధించడం పై పార్థసారథిని రామయ్య అభినందించారు. పట్టణ సమస్యలతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని ప్రధాన సమస్యల పరిష్కారం కోసం అందరి సహకాంతో కృషి చేస్తానని డా. పార్థసారథి అన్నారు. వారితో పాటు ఆదోని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మల్లప్ప ఉన్నారు.

బాల్య సాహిత్య పుస్తకాలు పంపిణీ

వెల్దుర్తి, జూన్, 19 : పట్టణంలో బీసీ బాలికల వసతి గృహానికి హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు హరిసింహనాయుడు, ఉపాధ్యాయుడు గఫూర్ బుధవారం హాస్టల్ వార్డెన్ శైలజకు బాల్యసాహిత్య పుస్తకాలు, ఆటవస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల పదవ తరగతి పరీక్షలో హాస్టల్ విద్యార్థినులు అత్యధిక ఉత్తీర్ణత సాధించారు.

టీడీపీ కార్యకర్త మృతి

వెల్దుర్తి, జూన్, 19 : కుక్కకాటుకు గురై కోలుకోలేక టీడీపీ కార్యకర్త కొమ్ము రామాంజనేయులు(62) బుధవారం మృతి చెందాడు. వారం రోజుల క్రితం చెరుకులపాడు గ్రామంలో కుక్క కాటు వేసింది. వెల్దుర్తిలో ప్రాథమిక చికిత్స చేయించుకొని మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుధవారం తెల్లవారుజామున కోలుకోలేక మృతి చెందాడు. మండల టీడీపీ నాయకులు చెరుకులపాడులో ఆయన పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రైతు సంఘం అధ్యక్షులు ఈదుల వెంకటరాముడు, రామాంజనేయులు, పార్థయ్య, మనోహర్ పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

పెద్దకడుబూరు, జూన్ 19: మండల కేంద్రం రజకుల ఆరాధ్యదైవం మడివాల మాచయ్యస్వామి గుడి నిర్మాణానికి బుధవారం టీడీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి రూ.2లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు సంక్షేమానికి టీడీపీ కృషి చేస్తుందన్నారు. రజకుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువనాయకులు ఇంద్రసేనారెడ్డి, రజక నాయకులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం

వెల్దుర్తి, జూన్, 19 : 18 సంవత్సరాలలోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని డోన్ సహాయ కార్మిక అధికారి శ్రీమతి నీలిమ సంధ్య అన్నారు. బుధవారం వెల్దుర్తి పట్టణంలో ఎన్‌పీసీఆర్ చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టారు. కిరాణషాపులు, మెకానిక్ షాపులు, బేకరీలు, హోటళ్ల యందు తనిఖీలు నిర్వహించారు. 18 సంవత్సరాలలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే 2 సంవత్సరాలు జైలుశిక్ష, జరిమానా యజమానికి విధిస్తారన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపాలన్నారు. ఈ తనిఖీల్లో సహాయ కార్మిక అధికారులు కేశన్న, రామ్‌ప్రసాద్‌లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలి

తుగ్గలి, జూన్ 19: పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఇద్దరు బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని సీపీఐ జిల్లా నాయకులు నబీ రసూల్, మండల కార్యదర్శి సుల్తాన్ డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం రామలింగాయపల్లెకు చెందిన కామేశ్వరి, సుంకన్న అను గొర్రెల కాపరులు గొర్రెలు కాస్తుండగా.. పిడుగు పాటుకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. వీరితో పాటు 90 గొర్రెలు కూడా మృతి చెందాయనీ, గొర్రెలు మేపుకుని జీవనం సాగించే కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

సొసైటీ సభ్యత్వాలను రెన్యువల్ చేసుకోవాలి

తుగ్గలి, జూన్ 19: సహకార పరపతి సంఘంలో ఖాతా ఉన్న ప్రతి రైతు వారి సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలని మారెళ్ల సొసైటీ సీఈవో నాయుడు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్ సహకార సొసైటీలో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచామని, అందుకు సంబంధించి రైతుల యొక్క అకౌంటు బుక్, పాస్‌బుక్, ఆదార్, పాన్‌కార్డు జిరాక్సులతో పాటు రెండు ఫోటోలు సహకార సిబ్బందికి అందజేయాలన్నారు. ఆధారాలు ఇవ్వకపోతే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సబ్సిడీలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. కాబట్టి ప్రతి రైతు పైన కనబరిచిన ధృవపత్రాలన్నీ జిరాక్స్ చేయించి ఇవ్వాలన్నారు.

న్యాయవాద వృత్తిలో రాణించాలి

పత్తికొండ టౌన్, జూన్ 19: న్యాయవాద వృత్తిలో యువ న్యాయవాదులు రాణించాలని పత్తికొండ సివిల్ జడ్జి భారతి అన్నారు. బుధవారం స్థానిక పత్తికొండ బార్ అసోసియేషన్ కార్యాలయంలో బార్ ప్రెసిడెంటు రంగస్వామి చేతుల మీదుగా బార్ అసోసియేషన్ సభ్యత్వాన్ని యువ న్యాయవాది క్రాంతి నాయుడు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో జడ్జి భారతి మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అన్యాయాల మీద న్యాయస్థానాలకు వస్తున్న బాధితులకు న్యాయం అందేలా న్యాయవాదులు కృషి చేయాలన్నారు. మంచి న్యాయవాదిగా పేరు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రవికుమార్, ట్రెజరర్ రాజశేఖర్ నాయుడు, సీనియర్ న్యాయవాదులు గోపాల్ రెడ్డి, షైరాముడు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు హర్షణీయం

మద్దికెర, జూన్ 19: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై సంతకం చేయడం హర్షణీయమని టీడీపీ న్యాయవాది జిల్లా కార్యవర్గ సభ్యులు నంది వీరేష్, సాంబశివ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ యజమానులు వారి కష్టార్జితంతో సంపాదించుకున్న ఆస్తులు దుర్వినియోగం కాకుండా యాక్టును రద్దు చేయడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధితో పాటు న్యాయవాదుల సమస్యలను గుర్తించాలని కోరారు. న్యాయవాదులకు కూడా ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలి

మద్దికెర, జూన్ 19: బడిఈడు పిల్లలందరూ ఖచ్చితంగా పాఠశాలలో ఉండేలా ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేయాలని మండల విద్యాధికారి రంగస్వామి తెలిపారు. బుధవారం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా జరిగిన సమావేశంలో విద్యార్థులందరూ బడిలో ఉన్నట్టు ధ్రువీకరణ సర్టిఫికేట్లు ఇవ్వాలన్నారు. ఎక్కడైనా బాలకార్మికులు పని చేస్తుంటే.. సమీపంలోని హాస్టల్‌లో చేర్పించాలని సూచించారు. ఎంఈవో-2 గోపాల్ ఉన్నారు.

రక్తహీనత వారసత్వంగా వచ్చే అవకాశం



మద్దికెరలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మద్దికెర, జూన్ 19: సహజంగా పిల్లలకు రక్తహీనత తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చే అవకాశాలున్నాయని ప్రభుత్వ వైద్యాధికారిణి రాగిణి అన్నారు. బుధవారం మద్దికెర గ్రామంలో సికిల్‌సెల్ అనీమియా వ్యాధి నిర్మూలన దినోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తకణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులో మారడం, తీవ్ర ఒళ్లునొప్పులు, కీళ్లనొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట తరుచుగా అంటువ్యాధులు వస్తున్నా గర్భాధారణ సమయంలో సమస్యలున్నా సికిల్ సెల్ అనీమియా వ్యాధి లక్షణాలుగా భావించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలని కోరారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, వైద్యసిబ్బంది గాయత్రీ, లక్ష్మిదేవి, ల్యాబ్ టెక్నీషియన్ విజయకుమార్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

దేవనకొండ ,జూన్ 19 : మండలంలో పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్ అన్నారు. బుధవారం తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి, ఇన్చార్జీ ఎంపీడీఓ ఇద్రూస్‌బాషాను కలిసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రజాసమస్యలు గాలికి వదిలి పాలన సాగించడంతో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడ్డారని అధికారుల దృష్టికి తెచ్చారు. టీడీపీ నాయకులు రామారావునాయుడు ,మల్లయ్య ,మలకన్న,వీరేష్ ,బంటుపల్లి వెంకటస్వామిగౌడ్ పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక పట్ల హర్షం

● బీసీలకు టీడీపీలోనే అధిక ప్రాధాన్యత

మంత్రాలయం, జూన్ 19: గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు యాదవ్ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం పట్ల మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం తన నివాసంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం సర్వనాశనమయ్యిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని అన్నారు. వాల్మీకులకు తగిన గౌరవం ఇచ్చింది టీడీపీనేనని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, బొజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

హరిద్వార్‌లో నూతన మఠం ప్రారంభం

మంత్రాలయం, జూన్ 19: మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో హరిద్వార్‌లో రూ.8 కోట్లతో నిర్మించిన నూతన మఠాన్ని మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు, వాదిరాజమఠం పీఠాధిపతి విశ్వ వల్లభతీర్థులు ప్రారంభించారు. బుధవారం మంత్రాలయం నుంచి హరిద్వార్‌కు విమానంలో ఉభయ పీఠాధిపతులు శిష్య బృందంతో బయలుదేరి వెళ్లారు. విమానాశ్రయం వద్ద మఠం మేనేజర్ ప్రసాదాచార్, మఠం విచారణకర్త శ్రీనివాస్ కస్బే అక్కడి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఉభయపీఠాధిపతులు వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య నూతనంగా నిర్మించిన భవనానికి రిబ్బన్ కట్ చేసి పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రకాషాచార్, పవమానాచార్, కిరణ్, అప్రమేయాచార్ తదితరులు పాల్గొన్నారు.



హరిద్వార్‌లో మఠం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పీఠాధిపతులు

క్రిష్ణగిరి పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జిగా జయన్న

క్రిష్ణగిరి, జూన్ 19: క్రిష్ణగిరి పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్‌గా కర్నూలు ఫ్యాక్షన్ జోన్ సీఐ ఏ.జయన్న బుధవారం రాత్రి బాధ్యతలు తీసుకున్నారు. ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎమ్.చంద్రశేఖర్ రెడ్డి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీఆర్‌కు వెళ్లారు. మండలంలో సమస్యాత్మక, సున్నితమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించడానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కర్నూలు ఫ్యాక్షన్ జోన్ సీఐ ఏ.జయన్న క్రిష్ణగిరి పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించారు.

అమర వీరులకు నివాళి

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 19 : ఏనుగుబాల గ్రామంలో విప్లవ ఉద్యమంలో అమరులైన ఎం వి ప్రసాద్, వసంతక్కకు రైతు కూలీ సంఘం తాలూకా నాయకులు దావీద్, శాంసన్ బుధవారం నివాళి అర్పించారు. 19వ వర్ధంతి సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులకు జోహార్లు అన్నారు. సాయుధ పోరాటాల ద్వారానే ఈ దోపిడీ వ్యవస్థను మార్చగలమని నమ్మి తమ జీవితాలను సాయుధ పోరాటానికి అంకితం చేసి పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడి అమరులయ్యారని, వీరి ఆశయాలను కొనసాగించి ముందుకెళ్తామని పేర్కొన్నారు.

ఆర్డీఓకు రెవెన్యూ సిబ్బంది సన్మానం



1 ఆర్డీవోను అభినందిస్తున్న అసోసియేషన్ నాయకులు

పత్తికొండ టౌన్, జూన్ 19 : నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలను ఎన్నికల అధికారిగా ఆర్డీవో రామలక్ష్మి విజయవంతంగా నిర్వర్తించారని అభినందనలు తెలుపుతూ రెవెన్యూ డివిజన్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం డివిజన్ ప్రెసిడెంటు నాగరాజు, సెక్రటరీ మల్లికార్జున స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల అధికారి రామలక్ష్మిని కలిసి పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. నాయకులు బాబు, ఈరమ్మ, రామదాను, వీరేష్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

కౌతాళం, జూన్ 19: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే శక్తిమంతులుగా రాణిస్తారని కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు దాట్ల క్రిష్ణంరాజు అన్నారు. కౌతాళంలో బుధవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏకల్ గ్రామోర్థన్ వారి సహకారంతో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు మారుతి మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టుమిషన్, ఎంబ్రాయిడరీ శిక్షణ తీసుకున్న మహిళలకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు.